క్లుప్తంగా

దసరా మహోత్సవాల పనులు ప్రారంభం



కైకలూరు: స్థానిక శ్యామలాంబ దేవస్థానంలో దసరా మహోత్సవ (రాట ముహూర్తం) పనులను సోమవారం ప్రారంభించారు. ప్రతి ఏటా మాదిరిగా నంబూరి ప్రతాపరాజు దంపతులు మొదటి స్తంభాన్ని పాతగా, అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి 13వ తేదీ వరకు అమ్మవారి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, శ్యామలాంబ దేవస్థాన చైర్మన్ గుర్రం రాంబాబు, రామలింగేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ బూరుబోయిన మోహనరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

నేడు చండీహోమం

మండవల్లి: మండలంలోని లోకుమూడి గరువు దత్తాశ్రమంలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు అమ్మవారికి అభిషేకాలు, తొమ్మిది గంటలకు చండీహోమం నిర్వహించనున్నట్లు ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయ్‌శంకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హోమం పూర్తయిన తర్వాత అన్న ప్రసాద వినియోగం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి



ముదినేపల్లి రూరల్ : మండలంలోని పెదపాలపర్రుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మెరుగుమాల గోవిందరాజులు (83) సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలక కార్యకర్తగా కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ తదితరులు గోవిందరాజులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ




గుడివాడ టౌన్: మిలాద్ ఉన్ నబీని ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని స్మరిస్తూ ఈ వేడుకలు జరుపుతామని ముస్లిం పెద్దలు తెలిపారు. పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు పట్టణ పురవీధుల్లో మహమ్మద్ ప్రవక్తను తలంచుకుంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీదు ప్రాంగణంలో అన్న సమారాధనలు జరిపారు. కార్యక్రమంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ ఎదుట శ్రీ లక్ష్మీ బైక్ మెకానిక్ వర్క్స్ అధినేత చుక్కల ఉపేంద్ర ఆధ్వర్యంలో వినాయక చవితి నవరాత్రుల పూజలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు భక్తులను అలరించాయి. అనంతరం స్వామివారి విగ్రహాన్ని కనక డప్పుల వాయిద్యాల నడుమ ఊరేగించారు.

12 రకాల కూరగాయల పంపిణీ



కైకలూరు: ముంపు నీటిలో మునిగిన గ్రామాల ప్రజలకు కై కలూరు జాగృతి స్కూల్ విద్యార్థులు, యాజమాన్యం 12 రకాల కూరగాయల ప్యాకెట్లను సోమవారం పంపిణీ చేశారు. కొవ్వాడలంక, మణుగునూరు, పెనుమాకలంక, చింతపాడు, పిల్లిపాడు, ఇంగిలిపాకలంక, దానగూడెం, కోమటిలంక గ్రామాలలో వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వీరబత్తిన సుధా, జక్కుల విజయ్, జాగృతి స్కూలు కరస్పాండెంట్ పానేం జయ కిషోర్‌బాబు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అంచనాలు లోపభూయిష్టం

- క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే పంట నష్టం అంచనాలు
- నష్టపోయిన రైతులకు మొండి చేయి
- పసుపు నేతల కనుసన్నల్లో అధికారుల అంచనాలు

గుడివాడ నియోజకవర్గంలో నష్టం అంచనాల వ్యవహారం లోపభూయిష్టంగా నిర్వహించారనే ఆరోపణలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు వరదలతో నష్టపోయిన రైతుల పంట నష్టం అంచనాల నమోదులో అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. నిజంగా నష్టపోయిన రైతులను పక్కనబెట్టి గ్రామాల్లోని టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు చెప్పిన వారి పేర్లనే నమోదు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో పంట నష్టం నమోదు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవుడు వరం ఇచ్చినా పూజారి వరం ఇవ్వని చందాన.. నష్టపోయిన ప్రతి ఎకరా పంట నష్టం నమోదు చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశించినా ఆ ఆదేశాలను తుంగలో తొక్కి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. నియోజకవర్గంలోని నందివాడ, గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 41,430 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇటీవల సంభవించిన వరదలతో పంట నష్టం ఎక్కువగా జరిగింది. నందివాడ మండలంలో 4,262 ఎకరాల్లో గాను 3,602 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లుగా అధికారులు తేల్చారు. సాగు జరిగిన పెదలింగాల, చినలింగాల, చేదుర్తిపాడు, ఒద్దులమెరక, పుట్టగుంట, అరిపిరాల, రామాపురం, కుదరవల్లి, జనార్దనపురం గ్రామాల్లో పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. వరదలు వచ్చి 15 రోజులు పైబడినా ఇంకా పంట పొలాలు ముంపు నుంచి బయట పడలేదు. నూరుశాతం పంట నష్టం జరిగిన మండలంగా నందివాడ మండలాన్ని ప్రకటిస్తారని రైతులు ఆశించారు. అధికారులు మాత్రం తూతూ మంత్రంగా అంచనాలు నమోదు చేసి గ్రామాల్లోని టీడీపీ నాయకులు చెప్పిన మాదిరిగా పంట నష్టం నమోదు చేయడంతో నిజంగా నష్టపోయిన వారికి అన్యాయం జరిగిందని బాధిత రైతులు వాపోతున్నారు. పంట ఇంకా వరద నీటిలో నుంచి తేలనిదే నష్టం జరగలేదని అధికారులు చెప్పడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గుడివాడ మండలంలో 14,675 ఎకరాల్లో వరి సాగు చేయగా కేవలం 1,610 ఎకరాల్లో మాత్రమే నష్టం జరిగినట్లుగా అధికారులు నివేదికలో చూపారు. దీనికి భిన్నంగా నష్టం జరిగింది మాత్రం భారీగానే ఉంది. తటివర్రు, రామనపూడి, చౌటపల్లి, మల్లాయపాలెం, మోటూరు, దొండపాడు గ్రామాల్లో వరదల వలన పంట కుళ్లి నష్టపోయిన రైతులను పక్కన పెట్టి పంట నష్టం జరగని వారి పేర్లను అంచనాల్లో నమోదు చేశారని ఆరోపణలున్నాయి. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పంటలను పరిశీలించేందుకు వచ్చిన సమయంలో నిజంగా నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, పంట నష్టపరిహారంలో నష్టపోయిన ప్రతిఒక్క రైతును నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసినా అధికారులు మాత్రం ఎమ్మెల్యే మాటను పక్కనబెట్టి వారి పని వారు చక్కబెట్టేస్తున్నారు.



తటివర్రు గ్రామ శివారు పొలాల్లో కుళ్లిన వరిపైరును చూపిస్తున్న కౌలు రైతులు

కాసులు ఇస్తేనే..

పంట నష్ట అంచనాలు రూపొందించడంలో నియోజకవర్గంలోని కొందరూ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పెట్టుబడులు పెట్టి నానా కష్టాలు పడి సాగు చేసిన పంట కళ్లముందే నాశనం అయ్యి పుట్టెడు దుఃఖంలో ఉన్న రైతులకు అధికారుల కక్కుర్తి తలకు మించిన భారంగా మారింది. పంట నష్టం జరిగిన రైతుల పంటలను నమోదు చేయడానికి ఎకరాకు రూ.1,000 చొప్పున అధికారులు సిబ్బంది ద్వారా వసూలు చేసే కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా మూడు పువ్వులు, ఆరు కాయలు అనే చందాన సాగించారని రైతులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇవ్వని రైతులను పక్కనబెట్టేశారని వాపోతున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు రావాలని రైతులు కోరినా రాకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చోటా నాయకులు చెప్పిన వారికి, పైసలు ఇచ్చిన వారికి పంట నష్టం జరగకపోయినా వారి పేర్లు నమోదు చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో జిల్లా అధికారులు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జోక్యం చేసుకుని నిజంగా నష్టపోయిన వారికి నష్ట పరిహారం వచ్చేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

పంట నష్టం నమోదు చేయలేదు



10 ఎకరాల్లో వరి సాగు చేశాను. ఇప్పటికే ఎకరాకు రూ.15 వేలు చొప్పున పెట్టుబడి పెట్టాను. వర్షాలతో పంట నీట మునిగింది. మూడున్నర ఎకరాల్లో పూర్తిగా పంట కుళ్లి పాడైపోయింది. పంట నష్టం అంచనా వేయాలని సంబంధిత అధికారులను కోరాను. అధికారులు మాత్రం అదిగో ఇదిగో వస్తామంటూ చెప్పారే గాని ఇప్పటి వరకు రాలేదు. పంట నష్టం నమోదు చేయలేదు.

– కొత్తూరి శ్రీనివాసరావు, కౌలు రైతు, తటివర్రు

రైతులకు న్యాయం చేయాలి



రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. వరదలతో పంట ముంపునకు గురై 1.50 ఎకరాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. పంట నష్టం అంచనా వేసే అధికారులు ఎదురు చూశాను.. రాలేదు. నష్టం అంచనాలు వేయాలని అధికారులను కోరా. పట్టించుకోలేదు. క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండానే పంట నమోదు చేశారు. ఇది అన్యాయం. దీని వలన మాలాంటి రైతులు తీవ్రంగా నష్టపోయాం. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మాలాంటి రైతులకు న్యాయం చేయాలి.

– కె.మోహనరావు, కౌలురైతు తటివర్రు

అప్పులు పాలయ్యా



ఏడు ఎకరాలు కౌలు తీసుకుని వరి సాగు చేశాను. ఎకరానికి రూ.15 వేలు చొప్పున అప్పులు చేసి మరి పెట్టుబడి పెట్టాను. వర్షాల వలన రెండు ఎకరాలు పూర్తిగా నాశనమైపోయింది. పంట కుళ్లిపోయి పనికి రాకుండా పోయింది. పంట నష్టం వేయాలని అధికారుల చుట్టూ తిరిగాను. అధికారులు అంచనా వేయడానికి రాలేదు. ఉన్నతాధికారులకు నివేదిక మాత్రం ఇచ్చారు. పంటలు చూడకుండా పంట నష్టం ఎలా వేస్తారో అధికారులే చెప్పాలి. మరోసారి అంచనా వేయాలి. మాకు న్యాయం చేయాలి.

– తుల్లిమిల్లి రమేష్, కౌలురైతు, తటివర్రు

వరద బాధితులకు రూ.లక్ష విరాళం



పామర్రు: వరద బాధిత కుటుంబాలను మంచి మనస్సుతో ఆదుకోవాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెంలోని వరద బాధితులకు సోమవారం చెన్నుపాటి యువ చైతన్యం సభ్యులు రూ. లక్షల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తోట్లవల్లూరు మండలంలో కృష్ణానది వరదల కారణంగా సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

బాధితులను ఆదుకుంటాం

పామర్రు: వరద బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. తోట్లవల్లూరు మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధిత కుటుంబాలకు సోమవారం నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తోట్లవల్లూరు మండలం ఐలూరు శివారు కనిగిరి లంక, ములకపల్లి లంక గ్రామాల్లోని, రొయ్యూరు శివారు తోడేళ్ల దిబ్బ గ్రామంలోని, వల్లూరు పాలెం శివారు కాళింగ దిబ్బ గ్రామంలోని వరద బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశామన్నారు.

దెబ్బతిన్న పొలాల పరిశీలన

నాగాపురం(పెదపారుపూడి): వరద ముంపునకు పంట పొలాలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే వర్ల కుమారరాజా అన్నారు. మండలంలోని నాగాపురంలో దెబ్బతిన్న పంట పొలాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రతి రైతుకు నష్టపరిహారం అందిస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

నందివాడ: నందివాడ మండలం ఇలపర్రు పంచాయతీలో వరద ముంపు కారణంగా ప్రజలు ఎటువంటి వ్యాధుల బారిన పడకుండా పారిశుద్ధ్యపనులు ముమ్మరంగా చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విఘ్నేశ్వరాయ నమోస్తుతే..

ఘనంగా గణనాథుల గ్రామోత్సవాలు

పామర్రు: గణపతి నవరాత్రుల్లో భాగంగా పలుచోట్ల స్వామివార్లకు సోమవారం గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక తోటలోని విఘ్నేశ్వరస్వామికి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామిని స్థానిక కాలువలో నిమజ్జనం చేశారు. విజయవాడ రోడ్డు, మచిలీపట్నం, చల్లపల్లి రోడ్డు, గుడివాడ రోడ్డులలో ఉన్న పలు వినాయక విగ్రహాలకు గ్రామోత్సవాలను నిర్వహించారు. అనంతరం స్వామి వార్లను స్థానిక పుల్లేరుకాలువలో నిమజ్జనం చేశారు.

జమీదగ్గుమిల్లిలో..

పామర్రు మండలంలోని జమీదగ్గుమిల్లి గ్రామంలోని వినాయక మందిరంలోని విఘ్నేశ్వరస్వామికి సోమవారం విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామికి అభిషేకాలను నిర్వహించి ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు స్వామివారి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేశారు. రాపర్ల గ్రామంలోని వినాయకస్వామి ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన చేశారు.

గణేష్ లడ్డూ రూ. 62 వేలు

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా భక్తులు సమర్పించుకున్న ప్రసాదం లడ్డూకు సోమవారం బహిరంగ వేలం వేశారు. 25 కిలోల లడ్డూను పంచకర్ల అమర్ రూ.62 వేలకు దక్కించుకున్నారు. స్వామి వారికి మరికొంతమంది భక్తులు సమర్పించిన లడ్డూలను వేలం వెయ్యగా మొత్తం లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 1 లక్ష 17 వేలు ఆలయానికి ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఆలయ పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మండవల్లిలో రూ.13,300

మండవల్లి: మండవల్లి స్టేషన్ రోడ్డులోని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించిన వినాయక ఉత్సవాల్లో భాగంగా లడ్డూల వేలం ఆదివారం రాత్రి నిర్వహించారు. 11 కేజీల లడ్డూను 13,300కి గుమ్మడి సూర్య ప్రకాశరావు కుమారులు, కృష్ణారావు సోదరులు, ఆరు కేజీల లడ్డూని 11,500కి గేమ్ ఛేంజర్ యూత్ కైవసం చేసుకున్నారు.

భారీగా నిమజ్జనాలు

గుడివాడ టౌన్: పట్టణంలో గణేష్ విగ్రహాల నిమజ్జనాలు సోమవారం భారీగా జరిగాయి. స్థానిక మెయిన్ రోడ్ లోని శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఏర్పాటు చేసిన స్వామి వారి విగ్రహాన్ని కూడా నిమజ్జనం గావించారు. శ్రీ రామ్‌పురంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు బ్రదర్స్ సారథ్యంలో, విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం విగ్రహాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సారథ్యంలో నిమజ్జనాలు జరిపారు.



పామర్రులో గణపతి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



గుడివాడలో లడ్డూ పాడుకున్న పంచకర్ల అమర్‌తో ఎమ్మెల్యే రాము



జమీదగ్గుమిల్లిలో పూజలందుకున్న విఘ్నేశ్వరస్వామి



గుడివాడలో స్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

విఘ్నేశ్వరుడికి డీఎన్నార్ పూజలు

కైకలూరు: ఆది వినాయకుడి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ దక్కాలని ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. కైకలూరు మండలం ఆటపాక కోదండ రామాలయం వద్ద 19వ వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా అన్నసమారాధనలో సోమవారం ఆయన పాల్గొన్నారు. భక్తులకు వడ్డన చేశారు. కార్యక్రమంలో సింగంశెట్టి రాము, కన్నా రమేష్, చొప్పాల రాము, తమ్మిశెట్టి కొండా, కన్నా బాబు, వేల్పూరి విజయకుమార్, పెద్దిరాజు పాల్గొన్నారు.



కైకలూరు మండలం ఆటపాకలో డీఎన్నార్ పూజలు

26 నుంచి విద్యార్థులకు పోటీలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీవైఈఓ శేఖర్‌సింగ్

మచిలీపట్నంటౌన్: శ్రీ సత్యసాయిబాబా 100వ జన్మదిన వేడుకల్లో భాగంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు ఈ నెల 26, 27, 30 తేదీల్లో నిర్వహిస్తారని సత్యసాయి సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ తెలిపారు. సోమవారం పోటీల కరపత్రాలను మచిలీపట్నం డీవైఈఓ బీఎస్ఈ శేఖర్‌సింగ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆంజనేయకుమార్ మాట్లాడుతూ పోటీల్లో మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లోని విద్యాసంస్థలు, కళాశాల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. మొదటి కేటగిరీలో 8, 9, 10 తరగతి విద్యార్థులు, ద్వితీయ కేటగిరీలో ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థులు, మూడో కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, బీఈడీ, డీఈడీ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో సమన్వయ కర్తలు పి.కల్యాణి, వరప్రసాద్, వెంకటచిన్నయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రంగనాయకస్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేట శ్రీ భూనీలాపరివారసమేత శ్రీ రంగనాయకస్వామి పవిత్రోత్సవాలు సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణారాధన, దీక్షాస్వీకరణ, రుత్విగ్వరణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఈవో కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

రైతులను ఆదుకోవాల్సింది ప్రభుత్వాలే



రైతులు నష్టపోయిన పంటను విలేకరులకు చూపుతున్న నాయకులు

గుడివాడ టౌన్: వరదలతో జరిగిన పంట నష్టాన్ని భర్తీ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు పేర్కొన్నారు. కౌలురైతు సంఘం నాయకుల బృందం సోమవారం బుడమేరు ప్రాంతంలో వరద కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం గుడివాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దెబ్బతిన్న వరిపంటను మీడియాకు ప్రదర్శించారు. ఒక్కో ఎకరాకు రూ. 25 వేలు రైతుకు కౌలు చెల్లించాలని ఇప్పటికే ప్రతి ఎకరాకు రూ. 10 వేల నుంచి రూ.12 వేలు పెట్టుబడి పెట్టారన్నారు. పూర్తిగా రైతు నష్టపోయాడు కనుక ప్రభుత్వం ఇచ్చే ఎకరాకు రూ.10 వేల పరిహారం ఎందుకూ చాలదన్నారు. గ్రామ స్థాయి వ్యవసాయ శాఖ ఉద్యోగులు పేర్లు నమోదులో కౌలు రైతు పేరుకు బదులు భూయజమాని పేరు నమోదు చేస్తున్నారని, దీనిని సవరించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు, గుడివాడ నాయకులు మురళీకృష్ణారెడ్డి, పి. ప్రసాదు, కె. ఏసుదాసు, ఎస్. సాంబశివరావు, ఎ. సాంబయ్య పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించి దాడి

గుడివాడరూరల్: కోడిమాంసం కొనుగోలు చేసిన డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు కులం పేరుతో దూషించి, దాడి చేసి గాయపర్చారంటూ పర్నాస గ్రామానికి చెందిన గంటా తంబి గుడివాడరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు సోమవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు మండలంలోని పర్నాస గ్రామానికి చెందిన గంటా తంబి ఆ గ్రామంలో చికెన్ షాపు నడుపుతాడు. అదే గ్రామానికి చెందిన కొలుసు నాగభూషణం మాంసం కొనుగోలు చేసి తీసుకెళ్లి రూ.140 తంబికి ఇవ్వాల్సి ఉంది. ఈ నెల 8వ తేదీన డబ్బులు గురించి తంబి నాగభూషణాన్ని ప్రశ్నించగా, ఇద్దరి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. స్థానికులు సర్ది చెప్పడంలో వివాదం ముగిసింది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని ఈనెల 15వ తేదీన నాగభూషణం తన ఇద్దరు కుమారులు కొలుసు బాలకృష్ణ, ప్రసాద్‌తో పాటు ఏలూరుకు చెందిన వారి బంధువులు కొన్నిపోటి నాగవెంకటేశ్వరరావు, మహేష్, వెలగల దీపక్, నిఖిల్, లక్కీ, నవీన్, అభిషేక్, నెల్లపు తేజ, సాహు, పల్లపోతు కాశీ విశ్వనాథ్‌లు తంబి ఇంట్లోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేసి అడ్డుకోబోయిన తంబి భార్య, పిల్లలపై విచక్షణారహితంగా దాడి చేసి, కులం పేరుతో దూషించారు. ఈ సంఘటనను చిత్రీకరించిన కుటుంబ సభ్యులపై కర్రలతో దాడి చేసి కొట్టారని బాధితుడు తంబి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు. గుడివాడ ఇన్‌చార్జి, మచిలీపట్నం డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా వైద్యశిబిరాలు

నాగాయలంక: వరద ముంపు ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రెడ్‌క్రాస్ కృష్ణా జిల్లా చైర్మన్ డాక్టర్ టీఎస్ఎస్ బాలాజీ చెప్పారు. నాగాయలంకలో సోమవారం పర్యటించిన ఆయన స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ వద్ద మాట్లాడారు. ప్రస్తుతం వైద్య శిబిరాలు నిర్వహణ తదితర అంశాలపై స్థానిక జట్లతో చర్చించడానికి వచ్చినట్లు తెలిపారు. కృష్ణానది వరదల నేపథ్యంలో దివిసీమలో ముంపునకు గురైన పలు మండలాల్లో అనేకమంది బాధితులకు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి టార్పాలిన్‌లు, వంటపాత్రల కిట్‌లు, హైజీన్ కిట్లు, వాటర్ బాటిల్స్ సమకూర్చి సమున్నతమైన సేవలు అందించామన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన రెడ్‌క్రాస్ నాగాయలంక సబ్ బ్రాంచి చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్ చేస్తున్న సేవలను బాలాజీ అభినందించారు. రెడ్‌క్రాస్ జిల్లా మేనేజర్ భవిరి శంకరనాథ్, కోశాధికారి కె.రామ్‌బాలాజీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుకోవాలి



మండవల్లి: జీవ వైవిధ్యానికి రక్షణ కల్పిస్తున్న ఓజోన్ పొరను కాపాడుకోవాలని ప్రొఫెసర్ సూదాబత్తుల విజయ్‌కుమార్, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు పేర్కొన్నారు. అంతర్జాతీయ ఓజోన్ పొర సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఇండియన్ బ్యాంక్ ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమికి 25 కిలోమీటర్ల ఎత్తులో ఓజోన్ పొర ఉంటుందని, ఇది సూర్యుని నుంచి వచ్చే హానికరమైన అతినీలలోహిత కిరణాలను భూమికి చేరకుండా రక్షిస్తుందని చెప్పారు. అతినీలలోహిత కిరణాలు భూమిపై ఉన్న సమస్త జీవరాశికి ప్రమాదకరమని తెలిపారు. ఈ కిరణాల వల్ల ముఖ్యంగా మనుషుల్లో దీర్ఘకాలిక వ్యాధి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఓజోన్ పొరను కాపాడుకోవడం కోసం చెట్లను సంరక్షించుకోవాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వీ రామారావు, తోట శ్రీనివాసరావు, వెన్న శ్రీనివాసరావు, రెహానా పాల్గొన్నారు.